క్లుప్తంగా

హైకోర్టు జడ్జి సురపల్లి నందకు సన్మానం



కవాడిగూడ: హైకోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన సురపల్లి నందను రజక అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ నర్సింహ్మ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమెకు రజకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. రజక అభివృద్ధి సంస్థ నాయకులు చంద్రమోహన్, కిషన్, సుధాకర్, రాజశేఖర్, వెంకటేష్, రాజేశ్వరి, సునంద తదితరులు పాల్గొన్నారు.

నేడు మాతా వైష్ణోదేవీ విశాల్ జాగరణ్

కాచిగూడ: శారదీయ నవరాత్రుల సందర్భంగా గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో ఈరోజు జరిగే మాతా వైష్ణోదేవీ విశాల్ జాగరణ్‌లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని 'మా వైష్ణోదేవీ జాగరణ్ మండల్' చైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్ విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమై ఆదివారం తెల్లవారుజామున హారతితో ముగుస్తుందని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదట జమ్మూలోని మా వైష్ణోదేవీ ఆలయ అర్చకులు లోకేష్‌జీ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం దేశంలోని ప్రఖ్యాత భక్తి పాటల గాయనీ గాయకులు భక్తి పాటలు ఆలపిస్తారని రాత్రంతా భజనలు, హారతి పఠిస్తూ దేవతా పురాణాలతో మాత వైష్ణోదేవిని పూజించవచ్చని ఉచిత ప్రవేశం ఉంటుందన్నారు. ఫలహారాలతో పాటు భోజన సౌకర్యం కల్పిస్తున్నామని ప్రత్యేకంగా జమ్మూలోని మా వైష్ణోదేవీ మాత దేవాలయం నుంచి తీసుకొచ్చిన ప్రసాదం, ఖజానాలను రూ.5 వేల మంది భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందజేసేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నాలా విస్తరణతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ భరోసా ఇచ్చారు. హుస్సేన్‌సాగర్ నాలా విస్తరణలో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని నల్లకుంట, గోల్నాక డివిజన్‌లో నాలాకు ఆనుకుని ఉన్న భవన యజమానులు నష్టపోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, బాధితులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. భవన యజమానులకు నిర్మాణంతో పాటు స్థలానికి సంబంధించి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. దీనిపై సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సాయిబాబా, నల్లకుంట డివిజన్ శివానంద్‌నగర్ బస్తీవాసులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపకూడదు



సీఐ ధరావత్ నానునాయక్

చిక్కడపల్లి: మద్యం సేవించి వాహనాలు నడుపరాదని చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధరావత్ నానునాయక్ హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నాంపల్లి 4వ ఎంఎం కోర్టు 10 మందికి జైలుశిక్ష, 15 మందికి జరిమానాను విధించినట్లు ఆయన శుక్రవారం సాయంత్రం వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని అది నేరమని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపుతూ.. ప్రమాదాల బారిన పడినవారు వారి కుటంబసభ్యులకు లేని సమస్యలు తెచ్చి పెట్టడమే అవుతుందని స్పష్టం చేశారు.

మాతా, శిశు సంరక్షణకు కృషి చేయాలి



అంగన్‌వాడీ టీచర్లకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమ

కాచిగూడ: మాతా, శిశు సంరక్షణకు అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది కృషి చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ సూచించారు. శుక్రవారం నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐసీడీఎస్) సూపర్‌వైజర్లతో కార్పొరేటర్ సమావేశమై పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రభుత్వం పరంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అందుతున్న పౌష్టికాహారం, నిత్యావసర సరుకులను చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, కిషోర బాలికలకు సక్రమంగా అందజేయాలన్నారు. బాల, శోభ, షర్మిల పాల్గొన్నారు.

హాట్ టాపిక్‌గా అంబర్‌పేట్ దేవస్థాన ఎన్నికలు

- సాధారణ ఎన్నికలను తలపిస్తున్న ప్రచారాలు
- పోటా పోటీగా మూడు ప్యానెళ్లు

అంబర్‌పేట: అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఎన్నికలు హాట్‌టాపిక్‌గా మారి సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయి. నియోజకవర్గంలో అంబర్‌పేట దేవస్థాన సేవా సమితికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సేవా సమితి పరిధిలో మూడు ప్రధాన పురాతన ఆలయాలు వస్తాయి. బోనాలు, శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. నగరంలో బోనాల వేడుకల్లో 4వ స్థానంలో నిలుస్తాయి.

- సేవా సమితి పరిధిలో ఉన్న అంబర్‌పేట మహంకాళీ ఆలయంలో చేపట్టే వేడుకల్లో వేలాది భక్తులు పాల్గొంటారు. శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించే దసరా రావణ దహన కార్యక్రమం వైభవంగా జరుగుతుంది.
- ఈ వేడుకల్లో సేవా సమితి కార్యవర్గం కీలక పాత్ర పోషిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న కమిటీ ప్రాతినిత్యం వహించడానికి తీవ్ర పోటీ నెలకొంది.

మూడు ప్యానెళ్లుగా...

- ఎన్నికల్లో పోటీ తీవ్రంగా ఉండటంతో మూడు ప్యానెళ్లుగా పోటీ చేస్తున్నారు. తాజాగా బరిలో ఉన్న అందరూ గత కమిటీల్లో బాధ్యతలు నిర్వహించిన వారే కావడం గమనార్హం.



అంబర్‌పేట మహంకాళి ఆలయం

- కొన్ని రాజకీయాలు ప్రవేశించి, గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారు అన్నట్లు బరిలో నిలుస్తున్నారు.

చింతల శ్రీనివాస్ ముదిరాజ్ ప్యానెల్..

- అధ్యక్షుడిగా చింతల శ్రీనివాస్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా బిందె మన్మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కెంచె చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా ఎడ్ల సుధాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సంజీవ చారి, కోశాధికారిగా అశోక్‌లు బరిలో ఉన్నారు.

శ్రీరాములు ముదిరాజ్ ప్యానెల్..

- అధ్యక్షుడడిగా శ్రీరాములు ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా ఎస్.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా ఆర్.కపిల్‌దేవ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా అచ్చిని రమేష్, కోశాధికారిగా మహేందర్‌రెడ్డిలు బరిలో ఉన్నారు.

శంకర్‌గౌడ్ ప్యానెల్..

- అధ్యక్షుడిగా వై.శంకర్‌గౌడ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా చెంగలి సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా దోమకొండ కిషోర్, కోశాధికారిగా గద్దం శ్రీధర్‌గౌడ్‌లు బరిలో ఉన్నారు.

గుడి చుట్టూ రాజకీయ ప్రదక్షిణలు..

- నగరంలో ఆలయాలు రాజకీయాలకు పరోక్షంగా ముడిపడి ఉండటంతో ఈ ఎన్నికల చుట్టూ రాజకీయలు ప్రదక్షిణలు చేస్తున్నాయి. ఎన్నికల్లో నిలబడే ప్యానెళ్ల ప్రతినిధులు తమకు పరోక్షంగా రాజకీయ ప్రజా ప్రతినిధులు ఆశీస్సులు ఉన్నాయంటూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.
- మహంకాళీ ఆలయం వద్ద ఉత్సవాల్లో రాజకీయం చేసేందుకు నాయకులు తాపత్రయ పడుతున్నారని పలువురు భావిస్తున్నారు.

సుమారు 700ల ఓట్ల కోసం..

- దేవస్థాన సేవా సమితి ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతుంది. 700 ఓట్ల కోసం మూడు ప్యానెళ్ల అభ్యర్థులు రాత్రి పగలు తేడా లేకుండా ప్రచారం చేస్తూ.. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి తిప్పలు పడుతున్నారు.
- ఎటు చూసినా ప్రచారం పర్వం కనిపిస్తుండటంతో సామాన్యులు ఆశ్చర్యపోతున్నారు. ప్రతి ఓట రూ ఓటు ఎవరికి వేయాలో స్పష్టతతో ఉన్నప్పటికీ వీరి ప్రచారం మాత్రం ఎక్కడా తగ్గడం లేదు.

'సీఎం కేసీఆర్ బ్రాహ్మణ పక్షపాతి'



అరుణ్ కుమార్

నల్లకుంట: బ్రాహ్మణ సంక్షేమం కోసం తమ వంతు సహకారం అందిస్తున్న సీఎం కేసీఆర్ బ్రాహ్మణ పక్షపాతి అని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. శుక్రవారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ ఆదేశాల మేరకు సమితి అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు ఇతర కమిటీ సభ్యులు టీబీఎస్ఎస్ సూర్యాపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సూర్యాపేట జిల్లా నూతన కార్యవర్గం..

జిల్లా అధ్యక్షుడిగా దేశ్‌ముఖ అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా దేవులపల్లి ఫణి కుమార్, ప్రధాన కార్యదర్శి గోపరాజు వాసుదేవ రావు, సహ కార్యదర్శి సరస్వతీభట్ల జ్వాలా నరసింహాచార్యులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ అభ్యున్నతికి తమ వంతు కృషి చేయాలని జిల్లా నూతన కమిటీ కార్యవర్గానికి సూచించారు. టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, దేశ్‌ముఖ రమాకుమార్, రంగారెడ్డి జిల్లా మంత్రి సునీల్, దేవులపల్లి అశోక్ కుమార్, బాలచందర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ: కళ్యాణ భారతి సేవా సమితి 9వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 26 న నాచారం మల్లాపూర్‌లోని నోమా ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు కళ్యాణ భారతి ప్రతినిధి పి.ఆనంద్ ప్రకటించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పెళ్లి కాని వధూవరుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'



మాట్లాడుతున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 25 న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే నిరుద్యోగ మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 'ఎన్నో ఏళ్ల నుంచి నిరుద్యోగులు కష్టపడి పరీక్షలు రాస్తే టీఎస్‌పీఎస్సీ ఆ ప్రశ్న పత్రాన్ని లీక్ చేసి నిరుద్యోగుల పొట్ట కొట్టిందని' ఆరోపించారు. నిరుద్యోగుల పట్ల విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రశ్న పత్రాల లీకేజీపై మంత్రి కేటీఆర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి చిన్న విషయానికి స్పందించే మంత్రి 10 లక్షల మంది నిరుద్యోగులకు పేపర్ లీకేజీ ద్వారా మోసం జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలన్నారు. కార్పొరేటర్లు పద్మావెంకట్ రెడ్డి, అమృత, మహాలక్ష్మీరామన్‌గౌడ్, పార్టీ నేతలు రాజశేఖర్ రెడ్డి, చాయాదేవి, సందీప్‌సాయి, కృష్ణాగౌడ్, కేశబోయిన శ్రీధర్, అట్లూరి సుభాషిణి, రజినీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పటిష్టం చేయాలి

కాచిగూడ: బీజేపీ పార్టీ సంస్థాగతంగా పోలింగ్ బూత్‌లను మరింత పటిష్టంగా తయారు చేస్తేనే విజయం సాధించినట్టు అని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. పోలింగ్ బూత్‌లో గెలిస్తే డివిజన్ గెలుస్తాం, డివిజన్ గెలిస్తే అసెంబ్లీలో గెలుస్తామని, అందువల్ల పోలింగ్ బూత్‌లను పటిష్టం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, సుదర్శన్, అజయ్‌కుమార్, తోట కృష్ణన్ ఆర్.ఎల్.రమేష్, రాజులు బాబా, కృష్ణంరాజు, కె.శ్రీనివాస్ రెడ్డి, మహ్మద్ సలీం, రంజిత్‌రెడ్డి, ఎస్.రాజేష్, జంగయ్య, బద్రి, దామోదర్ నాయుడు, శ్రీధర్‌గౌడ్, చంద్రకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలి..

కాచిగూడ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. పరీక్షల రద్దుతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. శుక్రవారం కాచిగూడ మోతిమార్కెట్‌లోని బీసీ మహాసభభకార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అఖిల పక్ష సమావేశం ద్వారా నిరుద్యోగులకు భరోసా కల్పించాలన్నారు. దీనిపై ఏకపక్ష నిర్ణయం తీసుకోకుండా అఖిల పక్ష సమావేశం ద్వారా అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. బీసీ మహాసభ నేతలు కృష్ణ, భాస్కర్, ప్రశాంత్, ప్రదీప్‌గౌడ్, ధరణీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ముస్తాబవుతున్న న్యూ రామాలయం



న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయం

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవాలయం (దేవాదాయ ధర్మాదాయ)లో ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 3వ వరకు సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలు, చలువ పందిళ్లతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. శుక్రవారం ఆలయ కార్యనిర్వాహణ అధికారి జయంతి మాట్లాడుతూ.. స్వామివారి కల్యాణోత్సవాల గురించి వివరించారు. 9 రోజుల పాటు రోజూ ఉదయం నవాహ్నిక దీక్షతో అభిషేకాలు, అర్చనలు, నీరాజన మంత్ర పుష్పం, సుందర కాండ పారాయణం, ఉపనిత్ పూర్వక అభిషేకాలు ఉంటాయని ప్రకటించారు. 29న ఉదయం సీతారామచంద్ర స్వామికి 108 కలశాలతో ఆవు పాలతో అభిషేకం ఉంటుందన్నారు. 30న 'శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం' ఉంటుందన్నారు. ఏప్రిల్ 3న హోమము, బలిహరణము, రథోత్సవం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు రామాలయ అర్చక స్వామి, ఆలయ గుమస్తాను సంప్రదించాలని కోరారు. భక్తులు కోవిడ్ నిబంధనలను పాటిస్తూ.. పూజాది కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

కాంగ్రెస్ నేతల హౌస్ అరెస్ట్



సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ప్రశ్న పత్రాల లీకేజీ బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలని దీనికి నైతిక బాధ్యత వహిస్తూ.. మంత్రి కేటీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఛలో ఉస్మానియా యూనివర్సిటీ పిలుపునిచ్చింది. యూనివర్సిటీకి వెళ్లకుండా సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, అఖిల భారత యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్‌యాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశ విధానాలను అవలంభిస్తుందని ప్రశ్నించే గొంతులను నొక్కేస్తుందని విమర్శించారు. ఏ ఉద్యమాల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందో అదే ఉద్యమాలను బీఆర్ఎస్ పార్టీ అణచివేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ఇదే నిరంకుశ విధానాలను అవలంభిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ప్రారంభమైన రంజాన్ మాసం

- చారిత్రాత్మక బడీ మసీదులో దాదాపు 5 వేల మంది ప్రార్థనలు
- హలీమ్, పండ్ల దుకాణాల వద్ద పెరిగిన రద్దీ
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు



భోలక్‌పూర్‌లోని బడీ మసీదులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ముషీరాబాద్: నియోజకవర్గంలో రంజాన్ మాసం ఘనంగా ప్రారంభమైంది. కాగా మొదటి రోజే శుక్రవారం కావడంతో వేలాదిగా ముస్లిం సోదరులు మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. భోలక్‌పూర్‌లోని చారిత్రాత్మక బడీ మసీదులో సుమారు 5 వేల మంది సామూహిక ప్రార్థనలను చేశారు. గత 2-3 ఏళ్లుగా కరోనాతో సామూహిక ప్రార్థనలు అంతంత మాత్రంగానే జరగగా.. ఈ ఏడాది నిబంధనలు లేకపోవడంతో ప్రార్థనలకు ముస్లింలు భారీ ఎత్తున తరలివచ్చారు. దీంతో నియోజకవర్గంలోని సుమారు 56 చిన్న, పెద్ద మసీదుల వద్ద ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

- ఉపవాస దీక్షకు నాలుగు రోజుల ముందే ఎమ్మెల్యే ముఠా గోపాల్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తి మేరకు తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్‌లు భద్రత చర్యలను పర్యవేక్షించారు. ఉదయం నుంచే ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు సాయంత్రం పండ్లు, ఫలహారాలతో ప్రార్థనల అనంతరం దీక్షను విరమించారు. దీంతో ఒక్కసారిగా పండ్ల దుకాణాలు, హలీమ్ సెంటర్ల వద్ద రద్దీ భారీగా పెరిగింది.

అవధాన విద్యా ప్రావీణ్యులు తిరుపతి-వెంకట కవులు



దివాకర్ల తిరుపతి శాస్త్రి జయంతి వేడుకల్లో నివాళులర్పిస్తున్న జస్టిస్ నాగమారుతి తదితరులు

చిక్కడపల్లి: చెల్లపిల్ల వెంకట, దివాకర్ల తిరుపతి శాస్త్రి ఇరువురూ తిరుపతి వెంకట కవులుగా ప్రసిద్ధులని వారు అవధాన విద్యా ప్రావీణ్యులని సీబీఐ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీ శర్మ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో దివాకర్ల తిరుపతి శాస్త్రి జయంతి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారుతీశర్మ మాట్లాడుతూ.. ఎందరో మహానుభావులు త్యాగరాయ కీర్తనను గ్రహించి చరిత్రలో ప్రసిద్ధులైన మహనీయుల జయంతులు నిర్వహిస్తూ.. వారిని సజీవంగా నిలుపుతున్నారని అభినందించారు. ప్రసిద్ధి పొందిన కృష్ణ రాయబారంలోని పద్యాలు తిరుపతివెంకట కవుల పాండవ ఉద్యోగ విజయాలు కావ్య నాటకాన్ని సాహితీవేత్త రమణ వెలమకన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. తిరుపతి శాస్త్రి చిన్న వయస్సులోనే మరణించినా.. వెంకట శాస్త్రి అనంతరం రచనలకు తిరుపతి వెంకటకవుల పేరుతోనే వెలువడటం వారి మైత్రి బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, బెవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, ఎస్.బీ.రామ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

రైల్లో ల్యాప్‌టాప్ చోరీ.. కేసు నమోదు

కాచిగూడ: రైల్లో ఓ ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీకి గురైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సత్యసాయి జిల్లా లేపాక్షి దేవరాపల్లికి చెందిన సుదర్శన్‌రెడ్డి ఈ నెల 20న కాచిగూడ నుంచి యెలహంకకు రైలులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో షాద్‌నగర్ రైల్వేస్టేషన్ వద్ద అతడి ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. శుక్రవారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీసులకు కేసును బదిలీ చేశారు.

తీన్మార్ మల్లన్నను వెంటనే విడుదల చేయాలి

కాచిగూడ: 'టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రం లీక్ చేసిన వారిని జైల్లో పెట్టాల్సింది పోయి నిరుద్యోగుల తరఫున పోరాడుతున్న తీన్మార్ మల్లన్నను కిడ్నాప్ చేసి పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని' తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ అధ్యక్షుడు చుండి శోభన్ బాబు అన్నారు. శుక్రవారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారం మామూలు తప్పిదం కాదని అత్యధిక స్థాయిలో ఉన్న రాజకీయ నాయకులు, ప్రభుత్వ పెద్దల మద్దతు లేకుండా జరగలేదని' ఆరోపించారు. దీనికి కారణమైన వారిని అరెస్ట్ చేయాల్సింది పోయి న్యాయం కోసం పోరాటం చేస్తున్న వారిని ప్రభుత్వం అరెస్ట్ చేయడం సిగ్గు చేటు అన్నారు. తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేసిన మల్లన్నను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

అంబర్‌పేట: గోల్నాక డివిజన్‌లో అసాంఘిక శక్తుల పట్ల చర్యలు తీసుకోవాలంటూ డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను కొందరు ప్రైవేటు వ్యక్తులు తామే అభివృద్ధి పనులను చేసినట్లు చెప్పుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులకు సంబంధం లేకుండా కొంతమంది వ్యక్తులు ప్రజల అభివృద్ధి పనులు ఎలా ప్రారంభిస్తారనే విషయంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అంబర్‌పేట: భార్య తాగుడుకు బానిస కావడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పటేల్‌నగర్‌లో ఎస్.రాజు భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా.. భార్య కల్లుతాగి చెప్పకుండా బయటికి వెళ్తుండటంతో పలుమార్లు హెచ్చరించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చిన కుమారుడు తలుపు తట్టగా తండ్రి తీయకపోవడంతో అనుమానం వచ్చి స్థానికుల సాయంతో తలుపులు తీయగా.. అప్పటికే ఉరేసుకుని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి

ముషీరాబాద్: రంజాన్, శ్రీరామనవమి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ యాదగిరి కోరారు. శుక్రవారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో చిక్కడపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్, గాంధీనగర్‌లో మైత్రి కమిటీ సమావేశం జరిగింది. సీఐ జహంగీర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన రంజాన్ మాసాన్ని మైనార్టీ సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు. ఈనెల 30న శ్రీరామనవమి వేడుకలను హిందువులందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. మసీదులు, ఆలయాలకు కావాల్సిన పోలీసు సేవలను అందిస్తామని ఏసీపీ తెలిపారు. మైత్రి కమిటీ సభ్యులు పోలీసులు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ.. శాంతిభద్రతల పర్యవేక్షణకు సహకరించాలని కోరారు. సీఐలు సంజీవ్‌కుమార్, మోహన్‌రావు, ఎస్సైలు, మైత్రి కమిటీ సభ్యులు అంజిరెడ్డి, నందికంటి గోపాల్‌రావు, ఆకుల అరుణ్, సందీప్‌ముదిరాజ్, రమేష్ రెడ్డి, అభియదవ్, సోహేల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ యాదగిరి

ఆయుష్మాన్ భారత్ పథకం పేదలకు వరం



ఆయుష్మాన్ భారత్ దరఖాస్తులను అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకంతో పేదలకు రూ.5 లక్షల వరకు ఉచితంగా ఆధునిక వైద్యం అందుతోందని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్డు పొందిన వారు ఏ ప్రైవేటు ఆసుపత్రిలోనైనా వైద్య సేవలు పొందవచ్చని సూచించారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్ బండ మైసమ్మనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ దరఖాస్తుల కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను అప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయించి కార్డులు కూడా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిరుపేదలు సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ పేద కుటుంబం వైద్య సేవలు పొందేలా ప్రధాని మోదీ ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కుటుంబ సభ్యులు ఎవరైనా రూ. 5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు మహేందర్‌బాబు, బీజేపీ నాయకులు భువనగిరి చంద్రశేఖర్, పవన్, కంప్యూటర్ సర్వీస్ అధికారులు ప్రమోద్‌రెడ్డి, యశ్వంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మహాధర్నాను విజయవంతం చేయాలి



వినయ్‌కుమార్

చిక్కడపల్లి: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద జరిగే నిరుద్యోగ మహాధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొనాలని బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్ కోరారు. శుక్రవారం గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కష్టపడి ఉద్యోగాల కోసం ఏళ్లుగా పోటీపరీక్షలకు సిద్ధం అవుతున్న నిరుద్యోగ యువత భవిష్యత్తును 'పేపర్ లీక్‌తో వారి జీవితాలను కాలరాసిన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు' బండి సంజయ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు బాధిత నిరుద్యోగ యువత కదిలిన ప్రభుత్వ వ్యతిరేకత గళాన్ని వినిపించి నిరుద్యోగ మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ బలోపేతానికి మరింత కృషి..

ముషీరాబాద్‌లో బీజేపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజవర్గ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో బూత్ సశక్తికరణ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. బూత్ సశక్తికరణ అభియాన్ ద్వారా శక్తి కేంద్రం ఇన్‌చార్జ్, సహ ఇన్‌చార్జ్, విస్తారక్‌లు, బూత్ అధ్యక్షులు దీనికోసం మరింత శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. స్థానిక గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజవర్గంలో బీజేపీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించే ఏకైక పార్టీ బీజేపీ అని దీనికి అనుగుణంగానే పార్టీ కార్యకర్తలు, నాయకులు కట్టుబడి ఉండారన్నారు. నగర బీజేవైఎం మాజీ అధ్యక్షులు వినయ్‌కుమార్, మహంకళీ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు అరుణ జయేందర్‌బాబు, సీనియర్ నాయకులు, శ్రీకాంత్, యాదగిరిగౌడ్, ఎం.ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట బీజేపీ అధ్యక్షుడిగా రమణ నాయుడు



కాచిగూడ: బీజేపీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడిగా ఏ.వీ.రమణ నాయుడు నియమితులయ్యారు. ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ అమృతకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తల సంఘటిత కృషితో విజయవంతం అయ్యేలా చూస్తానన్నారు.

నియామకంపై భగ్గుమంటున్న సీనియర్లు ..

నల్లకుంట: బీజేపీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడి నియామకంపై ఆ పార్టీ సీనియర్ నాయకులు భగ్గుమంటున్నారు. శుక్రవారం సాయంత్రం డివిజన్ సీనియర్ నాయకులు కొందరు రహస్యంగా అత్యవసర సమావేశం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల వరకు అంటీముట్టనట్టుగా తిరిగిన ఓ నాయకుడిని డివిజన్ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారంటూ డివిజన్ సీనియర్లు మండిపడుతున్నారు. స్థానిక సీనియర్ నాయకులకు కనీసం సమాచారం ఇవ్వకుండానే డివిజన్ అధ్యక్షుడిని నియమించడంపై పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారంటూ.. సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రోటోకాల్ ప్రకారం పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్న సీనియర్ నాయకులు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శుల్లో ఎవరికైనా డివిజన్ అధ్యక్ష పదవి ఇవ్వాల్సి ఉండగా.. పార్టీలో చురుకుగా లేని వ్యక్తిని నియమించడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ అధ్యక్ష పదవి నియామకంపై పునరాలోచించుకోవాలని పార్టీ పెద్దలను సీనియర్లు కోరారు. పార్టీలో తలెత్తిన విభేదాలను ఆసరాగా తీసుకున్న ఓ పార్టీకి చెందిన ముఖ్య నేతలు బీజేపీ అసమ్మతి నాయకులతో టచ్‌లో ఉన్నారని సమాచారం.